# అద్దంపై ఆవగింజ

రవి ఆఫీసు నించి ఇంటికొచ్చేసరికి, కుర్చీలో కూర్చొని చాలా విచారంగా కనిపించింది జానకి....ఎందుకలా వుందోనని, దగ్గరగా వచ్చి "ఏమైంది" అన్నాడు రవి.

"ఏంలేదు" అంటూ గబగబా వంటింట్లోకి వెళ్ళి, కాఫీ కలిపి తెచ్చింది. భార్యభర్తా కాఫీ తాగటమైంది.

జానకి స్కూలుకి సెలవలు... ఇంకా వారం రోజులున్నాయి. ఈ మధ్య జానకిలో ఏదో మార్పు గమనిస్తున్నాడు రవి స్కూల్లో ఎవరితోనైనా గొడవపడిందా,ఒంట్లో బాగలేదా అనిపించినా, అడిగితే అదీపేచీయే అని ఊరుకున్నాడు రవి. ప్రతి చిన్న విషయాన్ని సీరయస్‌గా తీసుకోవటం లోకాన్నంతా తాను ఉద్ధరించలేక పోతున్నాననే బెంగ, దీనికి తోడు చెల్లెలు రజని స్త్రీవాద అతిధోరణి బాగా మనసులో నాటుకోటంతో జానకితో హాయిగా మాట్లాడటానికి వెనుకాడుతున్నాడు రవి.

'మనశ్శాంతి ముఖ్యం నాకు' అన్నాడు ఓనాడు జానకితో.

"అంటే, నాకు మనశ్శాంతి అక్కర్లేదా...అంటే, నేనెలాగయినా బతికేయగలననా మీ ఉద్దేశం..." అంటూ ఏదో అర్థంలేకుండా పోట్లాటకి దిగింది జానకి.

రవికి ఆనాడే అర్థమయింది ఎవరి ప్రభావంతో, ఇలా మారుతుందో తన భార్య అని.

ఆ సాయంత్రమే రవి, జానకి చెల్లెలు రజని ఇంటికెళ్ళాడు. ఆ అమ్మాయి పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళిపై నమ్మకం లేదు నాకు అంటుంది. పైగా స్త్రీలందరూ అన్ని విధాలా అణచివేయదుతున్నారని, పురుషాధిక్యమే కారణమని, ఏ పదిమంది కలిసినా, ఇదే విషయం మాట్లాదుతుంది రజని. ఆ అమ్మాయి అభిప్రాయాలు ఆ అమ్మాయివి. కానీ జానకికి ఎందుకు అందరిపైనా చిరాకు. ముఖ్యంగా భర్తయినతనపైన కోపమెందుకో అర్థంకాలేదు రవికి... ఇలా అనుకుంటూ రవి, రజని ఇంట్లో అడుగుపెట్టాడు.

ఆమాట, ఈమాట అయ్యాక రజని అంది.

'ఏమిటి బావగారూ, ఈమధ్య అక్క చాలా చిరాగ్గా వుంటోంది' అంది వెంటనే "నీ ప్రభావమే నని నేననుకుంటున్నా" అన్నాడు. రజని ఫక్కున నవ్వింది...అలా నవ్వుతుంటే రవికి చాలా కోపమొచ్చింది.

'అక్క మీకు చెప్పిందా లేదా' అంది రవి వంక చూస్తూ.

'ఏమటి' - అన్నాడు. 'నా పెళ్ళి విషయం...'

'పెళ్ళా'

'ఏం, పెళ్ళి చేసుకోకుండా, ఇలానే వుండిపోతాననుకున్నారా...

'ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకుంటూ బతికితే పెళ్ళిలో వున్నంత భద్రత మరెక్కడుందీ... ఇంతకీ అబ్బాయి ఎవరిని అడగవేం..' అంది ఉత్సాహంగా.

'నువ్వే చెప్పు' అంటూ రజని వైపుచూశాడు రవి. సిగ్గుతో బుగ్గలు ఎర్రబడ్డాయి రజనికి. నవ్వుతుంటే బుగ్గలు సొట్టలు పడ్డాయి.

'ఈ రజని, పెళ్ళి చేసుకొని హాయిగా కాపురం చేస్తుందా - ఆ అమాయకుణ్ణి తన అధికారంతో కాల్చుకు తినేస్తుందేమో అని మనసులో అనుకొంటూ.

'మరి మీ అక్కయ్య నాకు చెప్పదేం' అన్నాడు.

'అక్కయ్య ఫ్రెండు తమ్ముడు - నాకన్నా నాలుగేళ్ళు చిన్నవాడు. ప్రేమకి ఏళ్లు, కులం, మతం అడ్డం కాకూడదు కదా' అంది. ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు రవి.

మా అక్క భయమేమిటంటే, పెళ్ళయ్యాక అతను నానా ఏడుపులు ఏడిపిస్తే, కట్నం తెమ్మని సాధిస్తే, ఆ మొగుణ్ని వదిలివచ్చేస్తావా అంటుంది. బావగారూ, మీరు చెప్పండి, విజయ్ చాలా మంచివాడు. అలాంటి పరిస్థితిరాదు - వచ్చినా నేను సర్దుకోగలను. హాయిగా అతనితో బతకగలను - నామాట వినక, తెగ బాధపడిపోతుంది అంది రజని. మళ్ళీ ' నాపెళ్ళి నాయిష్టం' అంది ఎంతో గర్వంగా..రవి ఏమీ అనకుండా కాసేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి ముందుగానే శుభాకాంక్షలు అందుకో అంటూ మరదలికి షేక్‌హేండ్ ఇచ్చాడు.

జానకి సోఫాలో కూర్చొని పత్రిక తిరగేస్తోంది. రంగమ్మ అమ్మగారి పాదాల దగ్గరగా జరిగి కూచుంది.

జానకి ఆ పత్రిక పక్కన పడేసి శ్రద్ధగా వింటోంది రంగమ్మ చెప్తున్న మాటలు.

రంగమ్మ మొగుడు తాగొచ్చి తంతాడట. వాడు రిక్షా తొక్కితే వచ్చే డబ్బంతా వాడే వాడుకుంటాడట....ఈ మధ్య రాత్రి బాగా పొద్దుపోయాక ఇంటి కొస్తున్నాడట...ఇలా చెప్తోంది రంగమ్మ. జానకి వింటుంది రంగమ్మ జానికి ఇంటి పనిమనిషి.

"ఇలాంటి మొగుడితో ఎంతకాలం పడతావే" అంది జానకి రంగమ్మ ఎర్రపూలర్రైక వంక చూస్తూ.

'ఏం చేయనమ్మా...తమరే ఏదైనా ఉపాయం చెప్పండి' అంది పక్కన పడేసిన చీపురు తీసి, గది ఊడ్చటానికి లేస్తూ.... రంగమ్మ దానిపనిలోకది వెళ్ళిపోయింది...జానకి అలా కుర్చీలో కూర్చొనే వుంది.

రవి లోపలకొచ్చాడు...

"ఎంతసేపైందీ" అంది గబుక్కున లేస్తూ జానకి.

"నువ్వు రంగమ్మ మొగుడితో ఇక వేగలేదన్నావు చూడు, అప్పుడే' అన్నాడు.

'అంటే, మీకు నవ్వుగా వుందా.... దాని బతుకు చూస్తే జాలేయటం లేదా... పాపం, తాగి తందనాలాడే మొగుడితో ఏ ఆడది మాత్రం ఎంతకాలం కాపురం చేస్తుందీ...' అంటూ దీర్ఘాలుతీస్తూ జానకి, రంగమ్మపై జాలీపడిపోతూ, బుగ్గని చేయి చేర్చి మళ్ళీ ఆ కుర్చీలో కూలబడింది....

కాలం పరిగెట్టింది. రజని రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేసుకుంది విజయ్‌ని. ఆ పెళ్ళికెళ్ళి ఆశీర్వదించింది రవి మాత్రమే. జానకి రానంది. ఎందుకంటే, చెల్లెలు ఒట్టి అమాయకురాలని, దాన్ని వంచించి, బెదిరించి, ప్రేమ కబుర్లు చెప్పి పెళ్ళాడాడు విజయ్ అంటుంది. దీని సంపాదన పెద్దదిగా మరి అంటుంది జానకి. జానకి మాటల్ని లెక్కపెట్టడు రవి. వివాహబంధానికి, ప్రేమకీ ఎవ్వరూ నిర్వచనం చెప్పలేరని, ఆ వ్యక్తులిద్దరకీ అది అర్ధమవుతుందని నమ్ముతాడు రవి. 'ఇద్దర్ని కలిపే ప్రయత్నం, చేస్తాను కానీ, చెడగొట్టను నేను' నువ్వు రాకపోతే మానేయ్, నే పెళ్ళికెదుతున్నా అన్నాడు. రజని విజయ్ చాలా హాయిగా వున్నారు. ఎలాంటి హెచ్చుతగ్గులు, భేద భావాలు మనసులోకి రాకుండా ఎంతో అన్యోన్యంగా వున్న ఆ జంటను చూస్తే మురిసిపోతాడు రవి.

రంగమ్మ ఆ రోజు వంటింటి గుమ్మంలో కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. జానకి ఓదారుస్తోంది... ఈ రోజు నేను వాడికి అన్నం ఒండలేదమ్మా...రాత్రి పొద్దుపోయి ఇంటికొచ్చాడనే కోపంతో...కానీ, అమ్మా నేను తప్పు చేశానా అంది అమాయకంగా రంగమ్మ.

'ఛీ.. ఇలా అయితే నేను నీకు ఏం ఉపాయం చెప్పగలనే రంగమ్మా.... ఒక్కమాట విను, జానకి గొంతు తగ్గించింది 'ఒదిలిపారేయ్ - వీడు కాకపోతే మరొకడు. నీకేం చిన్నదానివేగా" అంది. ఒక్కసారి ఉలిక్కి పడింది రంగమ్మ... ఆలోచిస్తూ ఆ గుమ్మంలోనే అలాగే కూచుంది రంగమ్మ.

రవికి ఒళ్ళుమండిపోయింది.

'జానకీ, నీకవసరమా' అన్నాడు.

'ఆ-అవసరమే-దాని గోడు చెప్పుకుంటుంటే వినద్దా -

"విని - మీరు చెప్పే సలహా ఏమిటో - రవి బల్లమీదున్న కాఫీ చప్పరిస్తున్నాడు.

'అలాంటి మొగుడుంటే ఏమిటి, లేకపోతే ఏమిటి అని అంది జానకి.

"వాడొచ్చి నిన్ను తంతాడు - ఏదో సర్దుకొండని చెప్తావా...'

'చాల్లెండి - ఎప్పుడూ అదే సర్దుకోవాలా...' అరిచింది జానకి.

'వాడు సర్దుకుంటాడు, అదీ సర్దుకుంటుంది - అదే జీవితం - వాళ్లు చాలా హాయిగా వున్నారు - నువ్వు కల్పించుకోకు' అన్న రవి మాటలకు మండిపడింది జానకి.... భార్యాభర్త మాటామాటా అనుకుంటుంటే, నెమ్మదిగా వెళ్ళిపోతోంది రంగమ్మ.

'ఒసేయ్ - ఓసారి వాణ్ణి రమ్మను, మాట్లాడుతా' అంది జానకి, తలూపి గబగబా వెళ్ళిపోయింది రంగమ్మ.

రాత్రి రవి క్లబ్బునుంచి ఇంటికొచ్చికారు పోర్టికోలో పెడుతున్నాడు.

'అయ్యా' - చేతులు కట్టుకు నించున్నాడు వెంకడు.

"తమరే చెప్పండి - మారుమనువా....' అన్నాడు

'ఏమిటీ' - అంటూ గేటు బయటికి నడిచాడు రవి, వెనకాలే వచ్చాడు వెంకడు.

'ఇదేమో అమ్మగారికేదో చెప్పిందిటండీ... అమ్మగారన్నారట - ఆ మొగడేమిటి వదిలేయే -మళ్ళీ పెళ్ళి చేస్తానన్నారటండీ - వెంకడు ఏడుపు గొంతు పెట్టాడు.

రవి చేతిలో సిగరెట్టు వేలికి కాలింది. కిందపడేసి తొక్కాడు - 'ఊ' అన్నాడు రవి.

'ఇదేమో ఎర్రి గొడ్డండీ....ఇంటికొచ్చి ఒకటే ఏడుపండీ' అన్నాడు రవికి వాణ్ణి చూస్తే జాలేసింది.

'అమ్మగారితో, రంగమ్మతో, నీతో -ఒకచోట కూర్చోపెట్టి మాట్లాడుతా.... ఏం ఖంగారు పడకు... నువ్వు తాగొచ్చి తంతావటగా...' ఆమాట రవి అనగానే వాడు ఫెళ్ళున నవ్వి, 'ఛీ, ఛీ, ...ఏదో ఓనాడు కోపమొచ్చి... అయినా, అయ్యగారూ మొగుడు పెళ్లాలమయ్యాక .... అయినా నా భార్య ఒట్టి వెర్రిదండీ - ఇట్టాంటివి చెప్పుకుంటారాండీ' అన్నాడు...వెంకడు అలా అంటుంటే, మీరూ అమ్మగారు ఎన్నిసార్లు పోట్లాడు కోలేదూ, మాకు తెలియదా అని హేళన చేస్తున్నట్లు అనిపించింది రవికి.

ఓ నిమిషం ఇద్దరూ మాట్లాడలేదు...నిశ్శబ్దం-

ఓమాట చెప్తా వింటావా' అన్నాడు రవి. వెంకడు తలూపాడు వినయంగా.

'నువ్వూ, రంగమ్మ ఓ నాలుగు రోజులు అలా జాతరకెళ్ళిరండి హాయిగా... అదే సమ్మక్క సారక్క జాతరకి" అంటూ జేబులోంచి సొమ్ము తీసి వెంకడి చేతిలో పెట్టాడు.

జానకి చిరాగ్గా అటూ ఇటూ తిరుగుతోంది.

'వచ్చాడా - నీ రంగమ్మ మొగుడు' అన్నాడు కళ్ళజోడు తీసి తుడుస్తూ.

'వస్తాడు - ఇంకాసేపట్లో వస్తాడు - అది తీసుకొస్తుంది లెండి అంది జానకి.

రెండు రోజులు గడిచాయి. రంగమ్మ, వెంకడు రానేలేదు. 'వాడు దాన్ని తాగొచ్చి చంపేసుంటాడు' అంది వీధిలోకి చూస్తూ, వస్తారనే ఆశ తగ్గిన జానకి.

'అది తాగొచ్చి వాణ్ణి...' నెమ్మదిగా అన్నాడు రవి.

'అది తాగటమేమిటి' అంది జానకి అరిచింది ఫ్రిజ్ తెరుస్తున్న వంటమనిషి, 'అది తాగుతుందమ్మా, వాడు తాగుతాడు..., ఆలుమగలు కబుర్లాడుకుంటూ తాగుతారమ్మా' అంది,

సామాన్య విషయంచెప్తున్నట్టు. జానకి వీధివైపే, చూస్తోంది.

వారం రోజులయింది, రంగమ్మ తలుపు తోసుకుని గబగబాలోపలకొచ్చింది. ఎర్రని మట్టి గాజులు చేతలనిండా మెరుస్తున్నాయి. మెళ్ళో పచ్చపూసల దండ, జడలో కనకంబరాలు -

' వాడొచ్చాడే...ఇవాళే తేల్చేస్తా' అంది జానకి రంగమ్మను చూస్తూ...రంగమ్మ ఆమాట పట్టించుకోకుండా 'వాడు అయ్యగారి గదిలో కూచున్నాడమ్మా...'

'ఇవి జాతరలో కొన్నడండీ...వచ్చగాజులు ప్లాస్టిక్వి కొన్నాడండీ...బాగున్నాయా అమ్మగారూ, అంది రంగమ్మ. జానకికి నోట మాట రాలేదు.

భార్యాభర్తలు భోజనాలు చేస్తున్నారు, రవికి చాలా ఆనందంగా ఉంది. వెంకడు, భార్య జాతరకే వెళ్ళొచ్చి హాయిగా ఉన్నందుకు...జానికికి అర్థం కాలేదు. తగవు నెలా సర్దుకున్నారో అని...తనేమీ సహాయం రంగమ్మకి చేయలేకపోయానని లోపల బాధగానే వుంది. వాళ్ళని జాతరకి పంపింది తన భర్తే అని తెలియదుగా జానకి వంక చూసి నవ్వాడు రవి.

'నువ్వేమీ బాధపడకు - వాడు దేవుడంటుంది అది.

అది ఒట్టి అయాయికురాలండీ అంటాడువాడు.

వీళ్ళని విడగొడితే మహాపాపం' అన్నాడు భార్య భుజంపై చేయేసి రవి.

'అంటే - వీళ్ళలా తన్నుకుంటూ - దాన్ని వాడు కొట్టి చంపుతుంటే పడివుండాలనేగా మీ ఉద్దేశ్యం' అంది కోపంగా జానకి.

'అవును - అలా తన్నుకుంటూ, తాక్కుంటూ, కలిసి పనిచేసుకుంటూ, నవ్వుకుంటూ, పోట్లాడుకుంటూ బతకాల నేనా ఉద్దేశం - దాంపత్యమంటే అదే - ఎవరైనా అంతే - తన కంచంలోంచి పెరుగు అన్నం ముద్ద జానకి నోట్లో పెట్టి, 'తిను, అంతే అందులోనే ఆనందం' - అన్నాడు.

అంతలోనే వెంకదు, రంగమ్మ వచ్చారు.

'అమ్మగారు - అది ఎర్రిదండీ, ఏం మాట్లాతుందో తెలియదండీ అన్నాడు.

ఆదుమంచోడేనమ్మా, నేనంటే పడిసస్తాడు - కాకపోతే తాగి...రంగమ్మేదో చెప్తోంది.

'ఓయబ్బో, నువ్వు తాగనట్టా' అంటూ మోచేత్తో పొడిచాడు రంగమ్మని వెంకదు.

జానకికి నవ్వాలో ఏడవాలో తెలియటంలేదు.

మొగుడంటే దానికిష్టం!

పెళ్ళామంటే వాడికిష్టం!

మరి గొడవెక్కడ?-

'నీలాంటి వాళ్ళతోనే' అంటూ జానకిని కౌగిలిలో ఉక్కిరిబిక్కిరి చేశాడు రవి. భార్యాభర్తల తగవు అద్దంపై ఆవగింజ లాంటిదని, ఇలా జారిపోతుందని మా అమ్మమ్మ ఎప్పుడూ చెప్పేది' అన్నాడు రవి జానకి బుగ్గలు ముద్దు పెట్టుకుని.

నెల రోజులయింది. రంగమ్మ పనిలోకి రావడంలేదు. ఓ రోజు రజని, విజయ్ కలిసి జానకి ఇంటికి వచ్చారు.

ఆ కబుర్లూ ఈ కబుర్లూ అయ్యాక పని మనుషులు, మానేయటాలు, ఇల్లాళ్ళ ఇబ్బందులు అక్కాచెల్లెళ్ళు మాట్లాడునడుకున్నాక, రజని అంది.

'ఏమో బాబు - నా ప్రాణం హాయిగా వుంది....వాడు నన్ను, విజయ్‌ని రిక్షాలో స్కూలు దగ్గర దింపుతాడు. వాడి భార్య ఇంట్లో పనిచేస్తుంది - అక్కా నువ్వు నమ్మలేవుకానీ, ఆ రంగమ్మ, వెంకదు ఎంత అన్యోన్యంగా వుంటారో - నేను ఈ విజయ్‌కి చెప్పా, వెంకడిని చూసి నేర్చుకొండి పెళ్లాన్ని ఎంత ప్రేమగా చూడాలో అని' అంది. ఆ మాటలు విని రవి పకపకా నవ్వాడు. జానకి ముఖం వెలవెల పోయింది.

- లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక
రజతోత్సవ సంచిక 2006. నెల్లూరు